# ఆకాశరామన్న

## యస్. వివేకానంద

ఓ అనగనగా అదొక సిటీ! అందొక ఆఫీసు!!

ఆఫీసులో యల్డీలు... యుడిలు... పర్యవేక్షణకై ఓ సూపర్‌వైజరు... ఆ పైన అందరికీ పెద్ద దిక్కు ఒక అధికారి!— వీరుకాక... ఇద్దరు స్వీపర్లు ఒక ప్యూను కూడా కలరు!

ప్యూనుగాడు ఏకాక్షి! — చిన్నప్పుడు క్రికెట్ ఆడుతుంటే చావు తప్పి కన్నులొట్టపోయింది! ఆ కారణంగా 'ఫిజికల్లీ హేన్డీకేపుడు' కోటాలో వుద్యోగం సంపాదించుకోగలిగేడు!— పేరు నూకరాజు!

ఇద్దరు స్వీపర్లలో ఒకామె ఆడకూతురు. పాపం విధవ రాలు! ఇద్దరు పిల్లల తల్లి. చదువూ సంధ్యా లేదు. మొగుడు పోయిన కారణంగా డిపార్ట్‌మెంట్ ఆమెకి వుద్యోగం ఇచ్చి ఆదుకుంది. ఈమె నామధేయం కమల!

ఇహపోతే... గుమాస్తాల్లో ఎవరికోడి కుంపటీ వారిది! అంటే... మనిషికో యూనియన్! మనుష్యులమధ్య అన్యోన్యత సఖ్యత బొత్తిగా లేదు. ఎవరి ప్రాపకం కోసం వారు పాకులాడతారు. మేకవన్నె పులులూ, గోముఖవ్యాఘ్రాల్లా ప్రవర్తించటం వారి నైజం!

ఆఫీసుల్లో ఎవ్వరినీ ఏమీ అనేటందుకు వీల్లేదు. పైవాడనే గౌరవం క్రిందివారికి లేదు— ఎవరికి వారే యమునా తీరే!

రంగధామరావు ఆ ఆఫీసుకు కొత్తగా ప్రమోషను మీదొచ్చిన మేనేజరు! జరా లౌక్యం తెలీని వ్యక్తి! ముక్కు సూటిగా పోయే రకం!

అతగాడి వెనకాల పొలం పుట్ర, ఆస్తి పాస్తీలాంటి వేమీలేవు. కేవలం వుద్యోగమే అతగాడికి శ్రీరామరక్ష! కష్టపడి ప్రమోషన్ల మీద పైకెదిగేడు.

ఆడపిల్లను బి.ఏదాకా చదివించి క్రితం ఏడే పెళ్ళి చేశాడు. ఇద్దరు మగపిల్లలూ చదువుచాలించుకుని స్వతంత్రంగా మంచి వుద్యోగాలు సంపాదించుకోగలిగేరు.

అంచేత ప్రస్తుతం ఎలాంటి బాదర బందీ లేని మనిషి రంగధామరావు. తనూ భార్యా ఇద్దరే! నెల జీతంలో సగానికిపైనా సీలింగ్!

'వర్క్ ఈజ్ వర్షిప్' అనే ధోరణి గల వ్యక్తి. ఈనాటి కుర్రకారులో చేస్తున్న వుద్యోగం పట్ల శ్రద్ధ... సంస్థపట్ల గౌరవం కొరవడటం చూస్తూ విలవిల్లాడిపోతూంటాడు రంగధామరావు.

రంగధామరావు రూల్సు మనిషి! ముక్కు మీదగుద్దినట్టుగా వుంటాయ్ అతగాడి మాటలు! తాను ఎదుటి వ్యక్తికి నచ్చినా నచ్చకపోయినా తన మనసులో వుద్దేశ్యమేమిటో కుండబద్దలుకొట్టినట్లు చెప్పగల సత్తా ధైర్యం బోలెడంత వుంది రంగధామరావులో.

ఉద్యోగమనే వైకుంఠపాళిలో పాముల వాతబడకుండా ఒక్కొక్క నిచ్చెన ఎక్కుతూ చివరికీస్థితికి ఎదిగేడు.

సిటీ... ఆఫీసు... అందులో మనుష్యులూ... అంతా కొత్తగా... వింతగా వుంది రంగధామరావుకి!

టైం ప్రకారం ఆఫీసుకి ఏ ఒక్కరూ రాకపోవటం... తీరా వచ్చాక శ్రద్ధగా... ఏకాగ్రతతో పనిచెయ్యకపోవటం... ప్రతి అరగంటకూ కాఫీకని టీకనేసి బైటికెళ్ళటం... సీట్లో వున్నంతసేపూ కబుర్లు జోకులు... కామెంట్సు... విసుర్లూ... పనిపట్ల నిర్లక్ష్యం... ఇవన్నీ చూస్తూంటే రంగధామరావుకి చిరాకన్పించింది.

చిత్ర విచిత్రంగావున్న ఆఫీసువాతావరణంలో ఇమడకపోతున్నాడు. ఇబ్బందిగా ఫీలవక తప్పటంలేదు.

నోరుమూసుక్కూర్చుంటే లాభంలేదనే నిర్ణయానికొచ్చిన రంగధామరావు క్రమేపీ ఒక్కొక్కరినీ నిగ్గదీయనారంభించేడు.

"ఇదిగో గోపాలం మనం ఆఫీసుకు రావలసింది పదింటికి! మీరు ప్రతిరోజూ టైముకి రాకపోవటం బాగోలేదు. పైగా రూల్సుకి వ్యతిరేకం! పద్ధతి మార్చుకోవటం మంచిది..." మెత్తగా చురకేశాడు రంగధామరావు.

అందుకుబదులు జవాబుకూడా చెప్పకుండా ఆపాదమస్తకం రంగధామరావుని ఓమారు నిర్లక్ష్యంగా చూచి విసురుగా వెళ్ళి సీట్లో కూర్చుండి పోయాడు గోపాలం.

అతని ధోరణికి విస్తుపోక తప్పలేదు రంగధామరావు.

సీట్లో కూర్చున్న గోపాలం సిగరెట్ వెలిగించాడు. పక్క లేడీ క్లార్క్ సుమతితో కబుర్లాడసాగేడు. వారిద్దరి మధ్య జోకులు నవ్వులు...

రంగధామరావు కొంచెం ఇరిటేటయ్యాడు.

"మిస్టర్ గోపాలం! మీరు పుటప్ చేయాల్సిన అర్జంటుఫైళ్ళ సంగతి చూడండి. ఎరియర్స్ క్లియర్ చెయ్యటానికి ప్రయత్నించండి..." హెచ్చరించాడు.

"వీడెక్కడ దొరికాడండీ కొత్త తద్దినం! మరీ ప్రీడంలేకుండా చేస్తున్నాడు— ఇట్లా అయితే మన మధ్య ఎక్కువ కాలం పనిచెయ్యలేదు పూర్ ఫెలో..." గొణిగేడు గోపాలం.

తాపీగా ఓ ఫైలు మీద పేరుకు పోయిన దుమ్ము దులిపి ఏదో గెలికి నూకరాజు చేతికిచ్చి ఆ ఫైలు రంగధామరావు టేబిలు మీదికి పంపాడు గోపాలం.

"ఇదిగో గోపాలం! ఫైలు నాముఖాన కొడితే కాదయ్యా— క్లియర్‌గా రూల్ పొజిషన్ నోట్ వ్రాసి పంపించు!..." ఫైలు మళ్ళీ తిప్పి పంపేడు రంగధామరావు.

"నాకు తెలిసిందేదో వ్రాశాను. కాదనుకుంటే మీరువ్రాయదల్చుకుంది మీరు వ్రాయండి..." తనకేమీ పట్టనట్టే మాట్లాడేడు గోపాలం.

బాధ్యతా రహితంగా ఇచ్చిన గోపాలం సమాధానానికి మనిషి హర్ట్ అయ్యేడు రంగధామరావు.

"నేను చెప్తున్నా... మీరు ఇంపార్టెన్స్ ఫీలవటం లేదు. దిసీజ్ నాట్ టాలరబుల్..." వేడిగా మాట్లాడేడు.

"ఏమిటండీ తల తీసేసినట్టు మాట్లాడతారు? రోజుకు ఎన్ని ఫైళ్ళని నేను మాత్రం చూడగలను?— నా సీట్లో వర్కులోడు హెవీగా వుందని మీకు తెల్సు... తెలిసీ మాట్లాడడం విడ్డూరంగా వుంది..."

గోపాలరావు ఇచ్చిన జవాబు వాదులాటకు దారితీసింది. ఇద్దరి మధ్యా కోల్డు వార్ చోటుచేసుకుంది.

మిగతా వారంతా పనిమానేసి వీరిద్దరి కేసి వింతగా చూస్తూ వుండి పోయారు.

* * *

నూకరాజు చాల తెలివైనవాడు. చేసేది ప్యూను వుద్యోగమైనప్పటికీ ఆఫీసుకి యూనిఫారంలో రాడు.

ఆఫీసరుకి తప్పమిగతా వారికి విష్ కూడా చేసేఅలవాటులేదు.

ఎవరు కాఫీ తెమ్మన్నా స్వహస్తాలతో తెచ్చే అలవాటు లేదు మనిషి ఫోజు పోతాడు. పైగా మాంఛి మాటకారి!

డబ్బు అవసరంవున్న ప్రతివాడూ నూకరాజునే అప్పులడుగు తూంటాడు. నెల తిరిగే సరికి ఎట్లా లేదన్నా రెండు వేల రూపాయల దాకా అందరికీ అప్పులిస్తూ ఫస్ట్ తారీకు వడ్డీతో సహా వసూలు చేసుకునే అలవాటున్నమనిషి నూకరాజు.

**డబ్బు అవసరం వున్న ప్రతివాడూ నూకరాజునే అప్పు అడుగుతుంటాడు. నెల తిరిగే సరికి ఎట్లా లేదన్నా రెండు వేల రూపాయల దాకా అందరికీ అప్పులిస్తూ ఫస్ట్‌తారీకు వడ్డీతోసహా వసూలు చేసుకునే మనిషి నూకరాజు...**

ఆ ఆఫీసులో అందరికీ అత్యంత ఆత్మీయుడు నూకరాజే!

ఈ విషయాలన్నీ తెలిసి రంగధామరావు నూటికి నూరు పాళ్ళూ నిఖార్సయిన ప్యూనుగా భావించాడు నూకరాజుని.

నూకరాజు తల బిరుసుతనం... ప్రవర్తన తీరు రంగధామరావుకి నచ్చకపోగా అనేక సందర్భాల్లో కోపాన్ని కూడా కల్గించేది.

"రాక్షసాగ్రేసరుడు ఈ రోజు రాలేదా..." ఖాళీగా వున్న మేనేజరు ఛైర్‌కేసి చూస్తూ ప్రశ్నించాడు గోపాలరావు.

"వాళ్ళ ఫాదర్ తద్దినంట... శలవు పెట్టేడు..."



గుమాస్తాలతో సమానంగా వాళ్ళ భుజాల మీద చేతులేసుకు తిరగటం... లేడీస్‌తో జోకులు... వెకిలిగా నవ్వటం... అనవసరమైన కామెంట్లు... ఇవన్నీ మాని ఓ ఫైన్ మార్నింగ్ వార్నింగిచ్చాడు రంగధామరావు.

నూకరాజంటే అల్లాటప్పాకాదు.

చేతివేళ్ళకు అయిదు బంగారపు ఉంగరాలున్నాయ్ మణికట్టుకు ఇంపోర్టెడ్ ఆటో మేటిక్ వాచీవుంది. జేబులో డబ్బుంటుంది ఇంటినుండి ఆఫీసుకు రావటానికో స్కూటరువుంది. ఇన్నివున్నా కేవలం చదువు లేకపోవటంతో... వుద్యోగం చేయాలనే వుబలాటం వుండటంతో మినిస్టర్‌గారికి దూరపు బంధువు కావటంతో బహు సునాయాసంగా ఆఫీసులో ప్యూను వుద్యోగాన్ని చేజిక్కించుకోగలిగేడు.

* * *

వెకిలిగా నవ్వుతూ మాట్లాడేడు యు.డి.సి గిరిధర్.

"అయితే మనందరికీ ఆట విడుపన్నమాటే... ఒరే నూకరాజూ!... వెళ్ళి ఓ యాభై టీలకు ఆర్డరిచ్చి రారా... ఖర్చంతా నేనే భరిస్తాను..." ఎస్టాబ్లిష్‌మెంట్ క్లార్క్ రెడ్డి ఎగిరి గంతేసినట్లే మాట్లాడేడు.

ఆరోజు ఆఫీసులో ఎవ్వరికీ పనిచేయాలన్పించలేదు. పైపెద్ద ఆఫీసరు కేంపులో వుంటాన, వారి విచ్చల విడితనానికి హద్దుల్లేకుండా పోయినయ్.

ఇంతలో టీలొచ్చేయి!

"ఒరే నూకరాజూ! రానురాను మన మేనేజరుగాడి

సాధింపువర్య మితిమీరి పోతోంది. పెద్ద పోజు కొట్టేస్తున్నాడు. కొరకరాని కొయ్యగా తయారవుతున్నాడనుకో! మన మంతా అతగాడి చేతి[క్రింద నీళ్ళు తాగేవాళ్ళంగా భావిస్తున్నాడు— అంచేత మనం ఆటకట్టించకపోతే ఏకు మేకౌతాడు. మన పరువు గంగపాలౌతుంది. ఈ ఆఫీసులో మనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు బొత్తిగా వుండవు...'' ఆవేదన వ్యక్తంచేశాడు శేషాద్రి.

అసలు ఆఫీసరే అన్నిటికి సర్దుకుపోతుంటే... మధ్యలో మేనేజరుగాడి పీడింపేమిటి?

ఈయన బెదిరింపులకు పసేమిరా మనం లొంగేది లేదు...'' సిగరెట్ వెలిగించిన రెడ్డి అగ్నికి ఆజ్యం పోశాడు.

వాళ్ళ సంభాషణ వేడి పుంజుకుంటోంది!

''మన కళ్ళముందు ఈ ఆఫీసులో ఎందరు మేనేజర్లు పనిచేసి పోలేదు— వాళ్ళందరి కంటే గొప్పవాడా ఈయన!? కొమ్ములు మొలిచాయా?... కీలెరిగి వాత పెట్టాల్సిందే...'' మీసం మెలేశాడు లోకేశ్వరరావ్.

''ఒరే నూకరాజూ!... అసలు మేనేజరు అలవాట్లేమి... ప్రవర్తన ఎలాంటిదో మెల్లగా పసికట్టరాదూ?... మనకు ఎక్కడోక్కడ దొరక్కపోదు... అప్పుడు గాని మన దారికొచ్చి చెప్పు చేతల్లో వుండడు...'' ఐడియా ఇచ్చేడు చలపతి.

ఈ ఆఫీసులో ఆయనగారు అడుగు పెట్టినప్పటి నుండీ నేను గమనిస్తూనే వున్నాను! అసలు మేనేజరు మనస్తత్వ మేమిటో బోధ పడిచావటంలేదు— ఎవరిదగ్గరా అర కప్పు కాఫీ తాగడు. సిగరెట్ అలవాటు లేదు— మందుగురించి కనీసం ఒక్కమాటైనా మాట్లాడి ఎరగడు. ఆడగాలి వున్నట్టు కన్పించదు. మరి... ఇలాంటి మనిషిని మనమెలా బుట్టలో వేసుకోగలమావి...'' బుర్ర గోక్కుంటూ అన్నాడు నూకరాజు.

''దిక్కుమాలిన మేనేజరు ఎక్కడ్నించి తగలడ్డాడోగాని... డిసిప్లిను... రూల్సు... అని అంటూ మనల్ని చెండుకు తింటున్నాడు.— పీడ పీడ ఎలాగైనా వదిలించుకునే ఉపాయం కొరకై వెతక్క తప్పదు. — పోనీ నూకరాజూ!... నీ మినిస్టర్ చుట్టంతో చెప్పి మరో చోటికి ట్రాన్స్‌ఫర్ చేయించరాదూ... అందుకు అయ్యే ఖర్చంతా మేమంతా చందాలేసుకు భరిస్తాం...'' చిరాగ్గా మాట్లాడేడు భజగోవిందం.

తర్కవితర్కాలతో ఆనాటి సభాకార్యక్రమం అసంపూర్ణంగా ముగిసింది. పిల్లిమెడలో గంట కట్టగల మగాడెవడానే నిర్ణయానికి రాలేకపోవటంతో సంభాషణలు అర్ధాంతరంగా నిల్చిపోయినయ్.

* * *

ఆ రోజు రంగధామరావు బర్త్‌డే!

ఇంటి పక్కనేవున్న రామాలయంలో అర్చన చేయించి ఆఫీసుకు బయల్దేరేడు.

సీట్లో కూర్చుని అటెండెన్స్ రిజిష్టర్లో సంతకంచేసి పనికి వుపక్రమించ బోతూండగా నూకరాజొచ్చి ''మిమ్మల్ని సార్ రమ్మంటున్నారు...'' చెప్పేడు.

కూర్చున్న వాడల్లాలేచి ఆఫీసరు ఎ.సి. గదికేసి నడిచాడు. ఛేంబర్లోకి ఎంటరవుతూనే విష్‌చేశాడు రంగధామరావు.

''కమాన్? బీ సీటెడ్!!...'' ఆఫీసరు త్రివిక్రమరావు ఇబ్బందిగా మేనేజరు ముఖంలోకి చూచేడు.

''టుడే ఈజ్ మైబర్త్ డే సార్!...'' కూర్చుంటూ బదులు పలికేడు.

''ఐసీ! మెనీ హేపీ రిటరన్స్... బైది బై ఇలాంటి సమయంలో మీ మనసు నొప్పించాల్సి వచ్చినందుకు నాకెంతో బాధగావుంది...'' త్రివిక్రమరావు ముఖంలో రంగులు మారేయి. కంఠస్వరంలో మార్పు కొట్టొచ్చినట్టు కన్పించింది.

''ఏమిటిసార్ అసలువిషయం...'' తదేకంగా ఆఫీసరు ముఖంలోకి చూస్తూ ప్రశ్నించేడు.

'రియల్లీ ఐయామ్ సారీ టు లేట్...''

పరిస్థితేమిటో అర్ధంకాలేదు రంగధామరావుకి.

''ఐనో యువర్ ఎక్స్ట్రెయిట్ ఫార్వర్డ్ పర్సన్!— ఐనో ఎవెరిథింగ్ ఎబౌట్ యు... బట్... బట్...

వాటీజ్ దిస్?... ''డ్రాయరు సొరుగులాగి అందులోంచి ఓ కాగితాన్ని తీసి రంగధామరావుకి అందించా డు.

అయ్యా,

మీ ఆఫీసులో పనిచేస్తున్న రంగధామరావు మేనేజరు మేకవన్నె పులి! గోముఖ వ్యాఘ్రం!! ఇతనికి లేని చెడ్డ అలవాటంటూ లేదు.

తాగుబోతు! తిరుగుబోతు!! లంచగొండి!!!



## సెన్సార్

''మీ సినిమాకి 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు సెన్సారు వాళ్ళు'' చెప్పాడు నిర్మాతతో ఓ సెన్సార్ బోర్డ్ మెంబరు.

''అదేమిటి సార్. నాది ఆర్ట్ ఫిల్మ్. అందులో చిన్నపిల్లలు చూడకూడని అసభ్యకర దృశ్యాలేంలేవుగా'' మొత్తుకున్నాడు నిర్మాత.

''అది నిజమేనయ్యా బాబూ. మరీ అంత మత్తిని చిన్న పిల్లలు భరించుకోలేరని ఇచ్చాం'' వివరంగా చెప్పాడు.

—సి.వి.నరసింహాదాసు
(విజయనగరం)

# నేనూ ఆంధ్రభూమి



## రీడర్ నుంచి రైటర్ దాకా


మేము, మావారి (డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, న్యూరోసర్జన్, విశాఖపట్నం) ఉద్యోగరీత్యా ఐర్లాండులో ఉన్నాము. మేము అక్కడకు వెళ్ళేసరికి ఆంధ్రభూమి లేదు. 1978 ఆగస్టులో ఇండియా తిరిగివచ్చాము. హైదరాబాద్‌లో ట్రైన్‌లో కాలక్షేపానికి మా వారు ఆంధ్రభూమి కొని తెచ్చియిచ్చారు. ఓహో కొత్త వీక్లీ అన్నమాట అని నిరాసక్తంగా పక్కన పెట్టేసాను. తరువాత పుస్తకం అంతా తిరగేసిన తరువాత చాలా బావుందే అనుకొని అదేమాట మా వారితో అన్నాను. అది నా మొట్టమొదటి అభిప్రాయం ఆంధ్రభూమి మీద.

అప్పటికి నా రచనలు ''రాధిక'' కలం పేరుతో కొన్ని వీక్లీలలో వచ్చాయి. 'ఆంధ్రభూమి'కి కథలు పంపించవచ్చు అనుకొని ముందుగా బాలభూమికి కథ పంపాను. వెంటనే పబ్లిష్ అయింది. ఆ తరువాత కథలు పంపడం, పెంపుడు పావురాల్లా తిరిగిరావడం అది వేరే సంగతి అనుకోండి.

ముందుగా ఆంధ్రభూమిని చూడగానే చాలా బావుంది అనే అభిప్రాయాన్ని తరువాత తరువాత మార్చుకోవలసిన అవసరం ఎంతమాత్రం కలగలేదు. రానురాను ఆంధ్రభూమి మీద ఇంట్రెస్ట్ పెరిగిందే తప్ప తరగలేదు. తరగదు కూడా. ఆంధ్రభూమి ఇలాగే అందరినీ అలరించాలని ఆశిస్తూ.

—శ్రీమతి కస్తూరీ ప్రసాద్
(విశాఖపట్నం)

# ఊరూ – పేరు



## బాపట్ల

క్రీ.శ. 1136 నాటి శాసనాలలో ఈ వూరిని భావపట్టణమని పేర్కొనడం జరిగింది. ఇక్కడ కొలువైన భావనారాయణ స్వామి పేరున ఈ వూరికి 'భావపురం' అని నామకరణం చేశారు. భావపురమే బాపంపట్లగా మారి చివరకు 'బాపట్ల' అయిందని చెప్తారు. ఫోటోలో కనిపించే భావనారాయణ స్వామి ఆలయాన్ని చోళ చక్రవర్తులలో ఒకడయిన పేర్గొంతా క్రిమి కంఠమహారాజు క్రీ.శ.593లో నిర్మించాడు.

## గుదిబండివారి పాలెం

మొదట సుమారు వంద సంవత్సరాల క్రితం 'గుదిబండి' అనే ఇంటి పేరుగలవారు ఇక్కడ స్థిరపడ్డారు. ఆ పేరుగల వారు ఎక్కువగా నివసించి నందువలన దీనికి 'గుదిబండి వారిపాలెం' అనే పేరు వచ్చింది.

ఈ గ్రామం గుంటూరు జిల్లా కర్లపాలెం మండలంలో వుంది.

అప్పుతు మోహన్‌రెడ్డి
(ఏనవరిమి)

## బండి ఆత్మకూరు

క్రీ.శ. 12వ శతాబ్దంలో ఈ వూరిని 'బండన' అనే పాలెగాడు నిర్మించినందువల్ల ఈ వూరికి 'బండనాత్మకూరు' అనే పేరొచ్చింది. క్రమంగా అదే 'బండి ఆత్మకూరు' అయింది.

—ఎస్. చంద్రమౌళి
(బండి ఆత్మకూరు)

## పెద్దాపూర్

ఈ గ్రామం చుట్టుపక్కల పల్లెల్లో కంటే పెద్దది. ఆయా పల్లెల్లో ఏవయినా తగువులయినప్పుడు వాటి పరిష్కారంకోసం ఈ గ్రామం వచ్చేవారు. ఏదైనా శుభకార్యాల విషయంలో కూడా ఇక్కడి పెద్దలని సంప్రదించేవారట. అందువల్ల 'పెద్దలపురం' అనే పేరొచ్చింది. ఇప్పుడు అదే 'పెద్దాపూర్'గా మారింది.

మెదక్ జిల్లాలో వుందీ గ్రామం.

—బి. బాబురావు

---

పైకి... వంగనాచిలా నీతులు వల్లిస్తూ మాట్లాడతాడు. తియ్యగా కబుర్లు చెప్తాడు. రూల్సు మనిషిననే చెప్పుకునే ఇతగాడు వయవంచకుడు!

ప్రమోషన్ మీద ఆఫీసులో చేరిన మొదటి రోజునే లేడీ స్వీపరు మీద కన్నేశాడు. ఆమె వెంటబడి వేధింపసాగేడు.

ప్రతిరోజూ ఎవరో ఒకరు ఇతగాడికి పీకలదాకా తాగించాల్సిందే! క్యాష్ రూపంలో కాకుండా వస్తురూపంలో లంచాలు తీసుకుంటూంటాడు.

ఇలాంటి వ్యక్తి ఆఫీసులో వుంటే.. అది డిపార్ట్‌మెంట్‌కే అగౌరవం.

ఇటువంటి దోషిపైన వెంటనే తగుచర్య తీసుకోవలసిందిగా హెచ్చరిస్తున్నాం.

ఈ పిటీషన్ కాపీని పై అధికారులకు ప్రభుత్వానికీ కూడా పంపుతున్నాం.

ఇట్లు
ఆకాశరామన్న.

చేతిలో పుత్తరాన్ని ఆసాంతం చదివేసరికి రంగధామరావులో గుండె దడహెచ్చింది. ముఖం చెమట పట్టింది. మనసంతా అల్లకల్లోలమైంది. నోట మాట కరువైంది.

"యు మస్ట్‌బి వెరీ వెరీ కేర్‌ఫుల్ విత్ యువరోన్ పీపుల్!!— ఎవరు మనకు శత్రువో... ఎవరు మిత్రుడో తెలీదు. దేస్ ఆర్ ఫేంటేడ్!..."

మౌనంగా త్రివిక్రమరావు ముఖంలోకి చూశాడు రంగధామరావు.

"ఈ లెటర్లో వున్న విషయాల్లో ఏ ఒక్కటీ నిజంకాదని నాకుతెల్సు! — కానీ... ఐయామ్ హెల్ప్ లెస్!... నాకు అప్పుడే ఫోన్ మెసేజి వచ్చింది— వెంటనే సస్పెండ్ చేసి ఎంక్వయిరి జరిపించమని ఆదేశించారు నన్ను..." ఐయామ్ సోసారి..."

రంగధామరావు కళ్ళు ఆవేదన పూరితమైన నీటితో నిండిపోయాయి. మనిషిలో జవసత్వాలుడిగి నట్టయ్యింది.

ఏం చేయాలో! ఏమని మాట్లాడాలో తోచని రంగధామరావు కూర్చున్న వాడల్లా నిర్జీవంగా లేచి నిల్చున్నాడు.

గది బైట తలుపు దగ్గర నిలబడి లోపల ఏం జరుగుతున్నదీ శ్రద్ధగా ఆలకిస్తున్న మూకరాజు పట్టలేని ఆనందంతో జరిగిందేమిటో ఆఫీసులో వాళ్ళందరికీ చెప్ప సంబర పడ్డాడు.

ఆఫీసులో వారంతా ఏకమై ముక్తకంఠంతో మనసుల్లోనే మూకరాజు చాణక్య తెలివికి కార్యశూరతకు 'జై'కొట్టేరు.

*




అభిమానం అనేక విధాలు. ఆంధ్రభూమిపై తమ అభిమానం రకరకాలుగా ప్రకటింపుకుంటూ వుంటారు పాఠకులు. ఏ విధంగా వ్యక్తం చేసినా పాఠకుల అభిమానాన్ని ఆంధ్రభూమి గుర్తిస్తుంది. గౌరవిస్తుంది. రూపాయి నోటుపై రాసి పంపించారు ఎస్.మదన్‌మోహన్, ఆలేరు. కరెన్సీని ఇలా దుర్వినియోగం చెయ్యడం మంచిది కాదని మనవి.